విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

గురువారం 6 మార్చి, 2025 | 4 పేజీలు



ప్రభుత్వ భూములలోకి ప్రవేశం నిషేధం

తహసీల్దారు శ్యాంసుందర్ రాజు

విశాలాంధ్ర-కలువాయి: 'విశాలాంధ్ర' జాతీయ దినపత్రికలో బుధవారం ప్రచురితమైన '100 ఎకరాల ప్రభుత్వ భూమికి స్కెచ్' అనే వార్త ప్రచురితం అవటంతో కలువాయి తహసీల్దారు శ్యాంసుందర్ రాజు, తెలుగురాయిపురం గ్రామంలో, ప్రభుత్వ భూముల్లో ప్రవేశించిన ఆక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు, తెలుగురాయిపురం గ్రామంలో దండోరా వేయించి, స్థానిక విఆర్ఓతో ఫ్లెక్సీ బోర్డు వేయించారు. దీనిపై 'విశాలాంధ్ర' వివరణ కోరగా, ప్రభుత్వ భూమి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి స్వాధీనం చూసుకుంటామని తెలిపారు.

దోచుకో.. దాచుకో.. అడిగేవారేరి

- జిల్లా స్థాయి నుండి మండల స్థాయి దాకా వసూళ్ల పర్వం
- రోడ్డు పక్కన ఉన్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు
- నెలకు కోట్లలో దోపిడి
- కలువాయి మండలంలో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం

విశాలాంధ్ర-కలువాయి: కలువాయి మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది తీరాన అనధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటుచేసి అక్కడ ఉన్న ఇసుకను రాత్రి పగలు తేడా లేకుండా, కలువాయి, అనంతసాగరం మండలాలకు చెందిన కొంతమంది బడా నాయకులు సిండికేట్‌గా ఏర్పడి పెద్ద పెద్ద ప్రొక్లయిన్లు, భారీ టిప్పర్లు, లారీలతో కలువాయి నుండి బెంగళూరు, చెన్నై, కృష్ణపట్నం పోర్టు వరకు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నా రెవెన్యూ కానీ మైనింగ్ శాఖ, పోలీస్ అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే అక్కడ భారీగా గుంతల పడి ఉన్నాయని, ఒక రోజుకు సుమారుగా రెండు నుండి నాలుగు లక్షల వరకు సంపాదిస్తూ జేబులు నింపుకుంటున్నారు. భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి, ఏర్పడుతుందంటూ మండల ప్రజలు వాపోతున్నారు. మధ్య తరగతి ప్రజలకు ఒక పక్క కూటమి ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు ఇస్తుంటే కలువాయి మండలంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుంది. ఇంత జరుగుతున్నా ఇసుక అక్రమ

2లో

ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

- రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- రీసర్వే పరిశీలనలో జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-మనుబోలు: ప్రతి గింజ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మనుబోలు మండలం పిడూరులోనే రిసర్వేను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రిసర్వే పర్యవేక్షణకు మనుబోలు మండలానికి వి చ్చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంచామని రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా మిల్లర్లు రవాణా సౌకర్యాల పై కూడా చర్చలు జరిపామని పేర్కొన్నారు. రైతులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తేమ శాతం ఎక్కువగా లేకుండా ఆరపెట్టే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరపై ఏమన్నా ఇబ్బందులు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే తమ లక్ష్యం అనిఅన్నారు. పిడూరు రైతులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో

2లో

కూడు, గూడు, గుడ్డ సిద్ధాంతాలతో ఆవిర్భవించిందే టీడీపీ

- కొట్టే ప్రభుత్వం పోయింది.. పెట్టే ప్రభుత్వమే వచ్చింది..
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

విశాలాంధ్ర-కావలి: ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ ఇవ్వాలనే సిద్ధాంతాలతో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని నెల్లూరు జిల్లా, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుండి 2024 వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒక సెంటు ఇంటి పేరుతో నాణ్యతలేని నాసిరకం ఇళు నిర్మించి అది కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. మన ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయాలనీ కోరారు. ప్రస్తుత స్కీంలో ఒక కాలానికి రూ.2.5 లక్షలు ఎస్టీలకు అదనంగా రూ.75 వేల, ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు ఇస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పడం చాలా శుభ పరిణామం అన్నారు. గతంలో అధికారులు టార్గెట్ కోసం బేస్‌మెంట్ నిర్మించుకొని వారిని కూడా నిర్మించుకోని వారిని కూడా నిర్మించుకున్నారని సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. అలాంటి వారిని అందరిని కూడా గుర్తించి ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలో నిర్మిస్తున్న కొత్త స్కీంలో వారి పేర్లు కూడా చేర్చాలని కోరారు.

ఐ లవ్ నెల్లూరుని విస్తృతంగా జనాల్లోకి తీసుకెళ్తాం

నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: నెల్లూరు చెరువు మీద ఎన్టీఆర్ నెక్లెస్ ఘాట్ నిర్మించే అదృష్టం తనకు దక్కిందని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరిలో ఐ లవ్ నెల్లూరు అనే భావన కలిగేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. నుడా కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మంత్రి నారాయణ సహకారంతో నుడాను నెంబర్ వన్‌గా గతంలో తీర్చిదిద్దానని, పేద ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా ఆహ్లాదకర మైన పార్క్ లను నిర్మించామనీ గుర్తు చేశారు. పుట్టిన నేల కోసం ఏదో ఒకటి చెయ్యాలనే తపన నాలో ఉందని... అందుకే ఎన్టీఆర్ నెక్లెస్ ఘాట్‌లో ఐ లవ్ నెల్లూరు బోర్డు ఏర్పాటు చేశానన్నారు.. ఇప్పుడు అదే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నామన్నారు. జిల్లాలో ఉండే ప్రజాప్రతినిధుల సహకారంతో నుడాను అభివృద్ధి చేస్తామన్న అయన, తిక్కన సోమయజీ దగ్గర నుంచి పుచ్చలపల్లి సుందరయ్య, పొనకా కనకమ్మ వంటి మహనీయులను గుర్తు చేసేలా వారి విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని దుకాణాలు, షాపింగ్ మాల్స్, కాలేజీ, ప్రభుత్వ ఆఫీస్ లవద్ద ఐ లవ్ నెల్లూరు బోర్డును ఏర్పాటు చెయ్యాలని కోరుతున్నట్లు కోటంరెడ్డి తెలిపారు. నెల్లూరోళ్లకు ప్రాంతీయ అభిమానం ఎక్కువగా ఉంటుందని, అందుకే ఈ బోర్డులు ఏర్పాటు చెయ్యమని కోరుతున్నామన్నారు. నెల్లూరుని శుభ్రంగా ఉంచుకుందామనే భావన అందరిలోనూ రావాలనేదే తన అభిమతం అని వివరించారు. క్లిన్ అండ్ గ్రీన్‌లో, అభివృద్ధిలో

2లో

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయండి

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: గత ప్రభుత్వ అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో -42 కారణంగా నెల్లూరు జిల్లాలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఎన్నో ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం ఆమె శాసన సభలో జిల్లాలోని పలు విద్యా సంబంధ సమస్యలను ప్రస్తావించారు. నెల్లూరు జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల మాత్రమే ఉందని, పురుషుల డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థలల్లో చదవడం పేద విద్యార్థులకు భారంగా మారిందన్నారు. చాలా డిగ్రీ కళాశాలలో హిస్టరీ, ఎకనామిక్, కామర్స్ లాంటి ఆర్ట్స్ విభాగాలు లేకపోవడంతో గ్రూప్-1 లాంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సమస్యగా ఉందని ఆమె సభ దృష్టికి తెచ్చారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేదని, విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలలకు అనుమతులు వచ్చినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఏర్పాటు కాలేదన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను ఏర్పాటు చేసి జిల్లాలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఆమె విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాలలో ఖాళీలను భర్తీ చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దాదాపు 2 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు ఒక హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆమె

2లో

ఎస్సార్ పికిల్ ఫ్యాక్టరీ యజమాని జీతాలు ఇవ్వలేదని మహిళల ఆందోళన

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో ఎస్సార్ పికిల్ ఫ్యాక్టరీ యజమాని గత నాలుగు నెలలుగా మహిళల దగ్గర వెట్టి చాకిరి చేయించుకుని జీతాలు ఇవ్వడం లేదంటూ మహిళలు ఆందోళనకు దిగారు. సిఐటియు నాయకులు దేవదానం మీడియాతో మాట్లాడుతూ మహిళల చేత వెట్టి చాకిరి చేయించుకొని జీతం అడిగితే దుర్భాషలాడుతున్న పికిల్ ఫ్యాక్టరీ రవి రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీతమడిగితే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. మీరు నన్ను ఏమి చేయలేరంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఇకనైనా పోలీస్ అధికారులు కలగజేసుకొని తమకు జీతాలు ఇప్పించవలసిందిగా కోరారు.

పంట నమోదు తప్పనిసరి ఏవో ప్రతాప్

విశాలాంధ్ర-కలువాయి: కలువాయి మండలంలో వరి కొనుగోలు కేంద్రాలు రైతు సేవా కేంద్రాల వద్ద ప్రారంభించారు. 2500 ఎంటి కన్నా అధికంగా దిగుబడి వచ్చే తెలుగురాయపురం, వేరుబోట్లపల్లి గ్రామాల్లో ఏ-గ్రేడ్ వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. 2,500 ఎంటి కన్నా తక్కువ దిగుబడి వచ్చే బద్దేవోలు, మదన్నగారిపల్లి, కుల్లూరు, కలువాయి గ్రామాల్లో, బి,గ్రేడ్ వరి కొనుగోలు కేంద్రాలుగా సిఫార్సు చేసి పంపించడం జరుగుతుంది. రైతులు ధరలు తగ్గుతున్నాయని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని .రైతు పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉందన్నారు. గ్రేడ్-ఎ వరి రకాలు క్వింటా రూ.2,320 ఒక పుట్టి ఐతే రూ.19,720 సాధారణ రకాలు ఐతే క్వింటా రూ.2300, ఒక పుట్టి ఐతే రూ.19,550 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీనిలో రవాణా, హమాలీ, ప్యాకింగ్ ఖర్చులు అన్ని కూడా అదనంగా సొసైటీ ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయని ఈ కొనుగోలు కేంద్రాలు వద్ద ధాన్యం అమ్ముకోవా లంటే ఈ పంట నమోదు తప్పనిసరి. ఈ కార్యక్రమంలో రైతులు, విఏఏలు, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ పాల్గొన్నారు.

సోమశిల జలాశయంలో మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-నెల్లూరు: అనంతసాగరం మండలం సోమశిల జలాశయంలో బుధవారం మృతదేహం లభ్యమైంది. సోమశిల ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో మృతదేహం జాలర్లకు కనిపించడంతో స్థానిక సోమశిల పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. ఎస్సై అనూష ఆధ్వర్యంలో మృతదేహాన్ని జాలర్ల సహాయంతో బయటికి తీశారు. మృతదేహం అనంతసాగరం మండలం పాత దేవరాయపల్లి గ్రామానికి చెందిన బత్తల ప్రభాకర్ గుర్తించారు. ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూష తెలిపారు.

గిరిజనుల భూములను మింగేసిన రాబందులు

విశాలాంధ్ర-ముత్తుకూరు: సర్వేపల్లి గ్రామంలో గిరిజనులకు చెందిన భూములను అప్పన్నంగా కొందరు భూస్వాములు మింగేయడం జరిగిందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం తెలిపారు. బుధవారం ఆయన కూటమి నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమకు జరిగిన అన్యాయాన్ని గత ప్రభుత్వంలో నాయకులు చేసిన అన్యాయాన్ని సురేష్ నాయుడు దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్జరీ సంతకాలు పెట్టించడంలో సిద్ధహస్తుడు కాకణి అయితే పేద గిరిజనులని రాత్రి 8 గంటలకి ఇంటికి పిలిపించుకొని నేరుగా సంతకాలు పెట్టించుకుని వాళ్ల పట్టా భూములని వాళ్లకు రావాల్సిన డబ్బుని లాక్కున్న వైనం ఈ సర్వేపల్లి వైసిపి నాయకులదన్నారు. గిరిజనులకి న్యాయం జరిగేంత వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని మీడియా పూర్వకంగా తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, తెలుగుదేశం పార్టీ నాయకులు బద్దేవోలు చెన్న కిష్టయ్య, కుంకాల సుమన్, సమాధి గోవిందు, చిట్టి బోయిన సాయి, డి.రాము, వెంగయ్య, చిరంజీవి, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల హైలెవల్ కాలువకు నిధులు కేటాయించండి

మంత్రి నిమ్మలకు రైతు సంఘం నాయకులు వినతి

విశాలాంధ్ర-మర్రిపాడు: సోమశిల హై లెవెల్ కెనాల్ కాలువకు నిధులు కేటాయించి కరువు ప్రాంతాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు, నెల్లూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ములి వెంగయ్య, రైతులతో కలిసి బుధవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఆత్మకూరు,ఉదయగిరి నియోజకవర్గం లోని కొన్ని మండలాలు త్రాగు,సాగునీరు వసతి లేక కరువుతో అల్లాడుతున్నారని, ఫ్లోరిన్ పీడిత ప్రాంతంగా ఉండడంతో గ్రామాలకు గ్రామాలే వలసలు వెళ్తున్నారని, వెంటనే హై లెవెల్ కెనాల్ పనులు ప్రారంభించాలని మంత్రి నిమ్మలకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సోమశిల జలాశయం అతి సమీపంలోని నియోజకవర్గాల్లో నీటి వసతి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతాన్ని రక్షించేందుకు 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హై లెవెల్ కాలువను ఓ ఉత్తర్వు ద్వారా మంజూరు చేసి 95 వేల ఎకరాలకు సాగునీరు, 2.5 లక్షల మందికి త్రాగునీరు అందించేందుకు మంజూరు చేశారు. 1520 కోట్లతో రెండు ఫేసుల్లో నిర్మించాలని, మొదటి ఫేస్లో 850 కోట్లు, రెండవ ఫేసులో 670 కోట్లతో పూర్తిచేయాలని తెలియజేశారు. మొదటి దశకు 850 కోట్లు కేటాయించినారు అయితే కొంత పనులు జరిగినప్పటికీ కొంత ఆగిపోవడం తో పైపులు,మోటార్లు తుప్పు పడుతున్నాయన్నారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించి బడ్జెట్లో నిధులు కేటాయించి, మెట్ట ప్రాంత ప్రజలకు సాగు, త్రాగునీరు అందించాలని మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు తెలిపారు.

పనితీరుని మెరుగుపరుచుకోండి: ఎస్ఈ వి.విజయన్

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులు అకౌంట్స్ విభాగపు అధికారులతో జిల్లా ఎస్.ఈ వి.విజయన్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ టెలికాన్ఫరెన్స్ ముఖ్య ఉద్దేశం ఏమనగా ప్రతి ఒక్క ఉద్యోగి వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి సంస్థకు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరడమైనది. రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాను అందించాలనే లక్ష్యంతో పనిచేయాలని, వోల్టేజ్ సమస్యలు ఉండకూడదని, విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రభుత్వం తెలుపుచున్నది అని దానికనుగుణంగా మన పనితీరు కూడ మెరుగు పరుచుకోవాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుని ఉన్నాయని వెంటనే వాటిని యుద్ధ ప్రాతిపదికను తొలగించాలని, పగటి పూట విద్యుత్ కాంతులు ఎక్కడ ఉండకూడదని ఆదేశించారు. ఇవన్నీ ఉద్యోగి పనితీరును నిర్దేశిస్తాయి అని కావున ప్రతిఒక్కరు పనితీరులో మార్పు తెచ్చుకోవాలని తెలిపారు. విద్యుత్ సిబ్బంది మీరు పనిచేసే ప్రదేశంలో మీ ఫోన్ నెంబర్ వినియోగదారులకు అందరికీ తెలిసేలా ట్రాన్స్ఫార్మర్ దిమ్మెల మీద మీ ఫోన్ నెంబర్ను వేయాలని తెలిపారు. దీనివల్ల విద్యుత్ పరంగా ఏ సమస్య వచ్చినా వినియోగదారుడు వెంటనే మీకు ఫోన్ చేయగలరని తెలిపారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: నూకవరం ఎస్సీ కాలనీ కి వెళ్లే రోడ్డును అడ్డుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కాలనీకి చెందిన పలువురు అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఈ మేరకు మంగళవారం వారు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ విషయంలో జరిగిన స్వల్ప వివాదాల్లో గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎస్సీ కాలనీ వాసులను దూర్భాషలాడారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాలనీకి వెళ్లే రోడ్డులో నేషనల్ హైవే వారు నిబంధనల ప్రకారం తూములను ఏర్పాటు చేశారని, రోడ్డుకు మట్టితోలి చదువు చేసే సమయంలో గ్రామానికి చెందిన ఇంటూరి చెంచమ్మ కుమారుడు లక్ష్మీ నరసింహం అడ్డుపడి అధికారుల దూర్భాషలాడడం కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేయ డం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ కుమారుడు దాచర్ల వెంకట్రావు అది ప్రభుత్వ భూమి అని వాదించినప్పటికీ వినకుండా రోడ్డును చదును చేయకుండా అడ్డుపడ్డారని తెలియజేశారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్దిపూడి శిఖామని, బద్దిపూడి నరసింహం, బద్దిపూడి ఏసోబు, బద్దిపూడి ఇసాక్, శిరోమణి, సుధాకర్,హరిబాబు, ఇస్రాయిల్, దావీదు, యానాది, సురేంద్ర, సుజన్, కృష్ణ, రాజశేఖర్, జగన్, ఆనంద్, మహేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యారంబ పిల్లల సంరక్షణ విద్య దినోత్సవం

విశాలాంధ్ర-మనుబోలు: బాల్యాంబ పిల్లల సంరక్షణ విద్య దినోత్సవం ఐసిడిఎస్ మనుబోలు సెక్టార్ సూపర్వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటాచల మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ విజయలక్ష్మి ఆదేశాల మేరకు జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సల్లో భాగంగా బుధవారం కాగితాలపూరు హరిజనవాడలోని అంగన్వాడి సెంటర్ నందు నిర్వహించారు. ఐసిడిఎస్ మడమనూరు సెక్టార్ సూపర్వైజర్ రమణమ్మ, ఏఎన్ఎం జయరావమ్మ, మీరమ్మ ,అంగన్వాడి వర్కర్ సిహెచ్. విజయమ్మ, ఆషా సుభరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి) ఆయన స్పందించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అదేవిధంగా గ్రీవెన్స్ ఎలా జరుగుతుందో మనుబోలు తాహసిల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సిహెచ్. సుబ్బయ్య, రీసర్వే తాహసిల్దార్ మంజుల, ఆర్ ఐ శ్రీకాంత్, వ్యవసాయ అధికారి జహీర్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు నాగార్జున రెడ్డి, శ్రీనివాసులు, వెంకయ్య, సచివాలయ సర్వేర్ శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అడిగేవారేరి

(మొదటి పేజీ తరువాయి) రవాణాపై ఉక్కు పాదం మోపకపోవడంపై మామూళ్లు మత్తులో ఊగుతున్నారా అని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ అక్రమ రవాణాను అడ్డుకట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

జనాల్లోకి తీసుకెళ్తాం

(మొదటి పేజీ తరువాయి) నుడాను నెంబర్ వన్గా తీర్చిదిద్దుతామని కోటంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కొన్ని ఆఫీస్లకు, ప్రభుత్వ స్కూల్స్ కి నుడా తరఫునే బోర్డులు స్పాన్సర్ చేస్తామని తెలిపారు. ఎంఐజి లేవుట్స్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆనంద్, మంత్రి నారాయణ సహకారంతో నుడా తరపున ఎక్కువ ఎంఐజి లేవుట్స్ వేస్తున్నామని... తక్కువ ధరకే ప్రజలకు మంచి ప్లాట్స్ని అందుబాటులోకి తెస్తామన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ దగ్గర మంచి లేవుట్ వేస్తున్నామని, ఎవ్వరికి నష్టం లేకుండా చూస్తామన్నారు. ఈ విషయంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని మీడియాకు తెలిపారు. ఐ లవ్ నెల్లూరు అనే కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు. గతంలో జరిగిన తప్పులు ఇక నుడా లో జరగవని, జరగనివ్వనని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, ఏవో రాజు పాల్గొన్నారు.

బలోపేతం చేయండి

(మొదటి పేజీ తరువాయి) అభ్యర్థించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ సమాధానమిచ్చారు. త్వరలోనే ఉన్నత విద్యా రంగంలో సమూల మార్పులు చేసి సంస్కరణలు తీసుకొస్తామన్నారు. చాలా చోట్ల ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ కళాశాలలను ఇండస్ట్రీలలో అనుసంధానం చేసి కొత్త కళాశాలల ఏర్పాటుతో పాటు అడ్మిషన్లు పెంచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలను చేస్తామని హామీ ఇచ్చారు.

8న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక సమావేశం

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: సామాన్య ప్రజల్లో సామాజిక స్పృహ పెంపొందించడానికి, జాతీయోద్యమానికి తగిన ఊతమివ్వడానికి, ప్రజల్లో మానవత్వ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో 20వ శతాబ్ది ప్రారంభంలో గ్రంథాలయోద్యమం ప్రారంభమయింది. ఉద్యమ ప్రభావంతో వాడవాడలా విరివిగా ఆ కాలంలో గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. గ్రంథాలయ చట్టం 1960 సం.లో ఏర్పడింది. ప్రజలు చెల్లించే పన్ను నుండి ఆంధ్ర ప్రదేశ్లో ప్రతి రూపాయకు 8 పైసల చొప్పున ఆస్తిపన్నుచేసి, గ్రంధాలయ అభివృద్ధికి వినియోగించాలని చట్టంలో నిర్దేశించబడింది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా గ్రంథాలయ నిధులు ప్రక్క దారి పడుతున్నాయి. గ్రంథాలయాలలో తగిన సిబ్బంది లేరు. క్రొత్తగా పుస్తకాలు కొనడం లేదు. ఉన్న పుస్తకాలను తగిన విధంగా ఉంచేందుకు కూడా వసతులు లేవు. ఈ కారణాల వల్ల సామాన్య పౌరులు గ్రంథాలయాలకి దూరం అయ్యారు. ఈ పరిస్థితుల్లో గ్రంథాలయ ఉద్యమం మరలా పునర్వికాసం కోసం ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఏర్పడింది. ఈ కార్యాచరణలో తొలి అడుగుగా 2024 డిసెంబరు 14వ తేదీన విజయవాడలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఊరేగింపు, సదస్సు జరిగింది. ప్రజల్లో మళ్ళీ పుస్తక పఠనం విషయంలో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఈనెల 8వతేదీ శనివారం సాయంత్రం 5.00 గంటలకు నెల్లూరు దర్గామిట్టలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయం విచ్చేసి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కన్వీనరును, కోకన్వీనర్ను, సభ్యులను నియమించాలని నిర్ణయించారు. పూర్వ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగావస్తారు. నెల్లూరు లోని వివిధ రచయితల సంఘాలనుండి బాధ్యులు, ఉత్సాహవంతులైన, సమర్ధులైన సభ్యులను నియమించబూనే ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు పుస్తక ప్రేమికులు తప్పక హాజరు కావలసిందిగా అరసం నెల్లూరుజిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుగు రామకృష్ణఅరసం నెల్లూరు జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్,డాక్టర్ కె కరుణశ్రీ లు ఒక ప్రగటనలో తెలపారు.

కండలేరు డ్యామ్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాపూరు మండలం లోని కండలేరు హైస్కూల్‌లో రాపూరు అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో బుధవారం సిడి పిఓ సునంద ఆ దేశాలతో వేపినాపి సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య అద్వార్యంలో బెటి బచావో- బెట్టి పడవో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సౌజన్యం తెలియజెస్తూ మహిళలు బాలికల కోసం హక్కు లు, సమానత్వం, సాధికారతలో బాగంగా న్యూట్రిషన్ డే, యోగా హెల్తీ ఉమెన్, హ్యాపీఎస్ట్ ఉమెన్ అనె కాన్సెప్ట్ కోరకు న్యూట్రిషన్ ఎగ్జిబిషన్, లైక్ మిల్లెట్స్, హెల్త్ డైట్,మై ప్లేట్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేపినాపి సెక్టార్ సూపర్ వైజర్ సౌజన్య, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్ధినిలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి మహిళ సరైన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలి సిడిపిఒ

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: ప్రతి మహిళ సరైన ఆహారం తీసు కొని ఆరోగ్యంగా ఉంటే తన కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని సీడీపీఓ శర్మిష్ట అన్నారు. బుధవారం వలేటి వారిపాలెం మండలంలోని చుండి అంగన్వాడీ సెంటర్స్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం అంగన్వాడీ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సీడీపీఓ శర్మిష్ట హాజరైనారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం థీమ్ అయినటువంటి అందరికి మహిళలు మరియు బాలికల కోసం హక్కులు, సమానత్వం, సాధికారత కొరకు ర్యాలీ నిర్వహించారు. ఈసీసీఈ డే, పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ పైన తల్లులకి అవగాహన కల్పించారు. పిల్లలకి అక్షరాభ్యాసం, గర్భవతులకి శ్రీమంతం కార్యక్రమం జరిపించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శర్మిష్ట మాట్లాడుతూ ప్రతి మహిళ ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉన్నట్లే నని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపెర్వైజర్ సునీత, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, రాజ్యలక్ష్మి ఆయాలు సుశీల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటలో ఈ నెల 9 నుండి 15 వరకు జరుగనున్న శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి స్వీయ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది రేయింబవళు శ్రమిస్తున్నారని ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ తెలిపాడు. బ్రహ్మోత్సవాలకు ముందుగా బుధవారం నిర్వహించిన స్వామివారి హుండి లెక్కింపులో 35 రోజులకు నాలుగు లక్షల 12 వేలు రాబడి లభించిందన్నారు. కొండమీద చలువ పందిళ్లు, రధంతిరిగే ప్రదేశాలలో రోడ్ల విస్తరణ, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు పూర్తికావచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు అయినందున శాసనసభ్యుడు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తూ, లక్ష లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీచేశాడు. పైకార్యక్రమంలో ఆయన వెంట దేవస్థానం పరిశీలకులు, మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

రేపు టౌన్ ప్లానింగ్ ఆర్‌డిడి శిక్షణ సమావేశం

- సిటీ ప్లానర్ పద్మజ

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: ప్రాంతీయ సంచాలకులు పట్టణ ప్రణాళికా విభాగము, గుంటూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ శుక్రవారం నాడు నెల్లూరు నగర పాలక సంస్థతో పాటు ఆత్మకూరు, కావలి, బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్.టి.పి. లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం సిటి ప్లానర్ పద్మజ తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఉదయం 10 గంటలకు జరగనున్న శిక్షణలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్దేశించిన వివిధ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు కల్పించనున్నారని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగంలో నూతన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకునేందుకు లైసెన్స్‌డ్ సివిల్ ఇంజనీర్లు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ, ఇతర నగర పంచాయతీల కమిషనర్లు తమ పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది, ఎల్.టి.పి.లు శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్ సూచించారు.

పశువులు, గేదెలు, ఆవులకు గాలి కుంటు టీకాలు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలో ఈ నెల 1వ తేది నుండి 31వ తేది వరకు పశువులకు, గేదెలకు, ఆవులకు, 6 నెలలు పైబడిన దూడలకు గాలి కుంటు టీకాల కార్యక్రమం మొదలైందని అందులో భాగంగా బుధవారం శానాయపాళెము, తేగచర్ల, రాపూరు టౌన్‌లో 300 పశువులకు, గేదెలకు, ఆవులకు దూడలకు టీకాలు వేశారు.

చిన్నారులు వయసుకు తగ్గ ఎత్తు బరువు ఉండాలి

విశాలాంధ్ర-జలదంకి: చిన్నారులు వయసుకు తగ్గ ఎత్తు బరువు కలిగి ఉండాలని, ఎంతో ఆరోగ్యంగా ఉండాలని సమతుల ఆహారంతోనే ఇది సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఓ పద్మజాకుమారి తెలిపారు. బుధవారం జమ్మలపాలెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రాముఖ్యతను చిన్నారుల తల్లిదండ్రులకు తెలియజేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. జలదంకి పంచాయతీ పరిధిలోని గమల్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు అంగన్వాడీ కార్యకర్త ఆర్. పద్మావతి నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులకు పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో సూపర్వైజర్ హైమావతి, అంగన్వాడి కార్యకర్త మౌనిక, కిషోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీటర్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-కావలి: కావలి పట్టణం లోని వెంగళరావు నగర్‌లో పీటర్ పాల్ మినిస్ట్రీస్ 8వ వార్షికోత్సవం, పీటర్ పాల్ మినిస్ట్రీ కన్వీనర్ దేవరకొండ పీటర్ పాల్ జన్మదినం సందర్భంగా ఏరియా ఆసుపత్రి సహకారంతో 7వ మెగా రక్తదాన, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించారు. ఈ శిబిరానికి యువత, ట్రాన్స్‌జెండర్లు, పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా 250 మంది రక్తదానం చేశారు. పీటర్ పాల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, దళిత గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ దేవరకొండ సుధీర్ బాబు స్వయంగా పాల్గొని రక్తదానం చేశారు. బుధవారం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పాస్టర్‌కు నిరుపేదలకు వస్త్ర దానం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవరకొండ సుధీర్ బాబు మాట్లాడుతూ పీటర్ పాల్ మినిస్ట్రీ ద్వారా ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది రక్తదాన శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిరుపేదలకు వైద్యం అందించేందుకు ఎల్లవేళలా డాక్టర్ అందుబాటులో ఉండి పీటర్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతనంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించాము అని పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయం అని అన్నారు. దేవుడి కృపా కటాక్షాలతో రానున్న రోజుల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ క్యాంప్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, పాడేటి థామస్ పీటర్ పాల్ మినిస్ట్రీస్ సభ్యులు రేవరెండ్లు జయ పాల్, ప్రభుదాస్, ఏసుబాబు, కృపా రావ్, ఇమ్మానుయేలు, కలికి రాజేంద్ర, నెల్లూరు క్రిస్టియన్ నాయకులు బర్ణ బాస్, ఊరందూరు సురేంద్ర, వై.టి.రవి మినిస్ట్రీస్ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ రావ్‌కు డాక్టరేట్



విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నార్త్ రాజు పాలెం, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగంలో వెర్బల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ గా విధులు నిర్వహిస్తున్న డి.దుర్గాప్రసాద్ రావ్ డాక్టరేట్ లభించింది. జేమ్స్ బోల్డ్ విన్ నవెల్స్: 'ఏ స్టడి ఇన్ థిమాటిక్ కన్సర్న్' అంశంపై ప్రొఫెసర్ వి.రవి నాయుడు మార్గదర్శకత్వంలో ఈయన డాక్టరేట్ పొందినట్లు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లా నాయక్ తెలిపారు. అందువల్ల సానుభూతిపరులు అభిమానులు విద్యార్థులు హర్షం వ్యక్తపరిచినారు.

అరుంధతి వాడలో డ్రైనేజీ కాలువ పరిశుభ్రత కార్యక్రమంలో జనసేనా మండల అధ్యక్షురాలు కస్తూరి

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీలోని అరుంధతీయ వాడ 10వ వార్డులో డ్రైనెజ్ కాలువల పరిశుభ్రత పారిశుధ్యం,వీధి లైట్లు,పంచాయతీ కార్మికులతో దగ్గరుండి వార్డు సభ్యులు చెయవలసిన పనులను రాపూరు స్థానికులు జనసేన పార్టీ వీర మహిళ జనసేనా రాపూరు మండల అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి ప్రత్య క్షంగా పాల్గోని పనులు చెయిస్తూన్నారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ అరుంధతి వాడలోని డ్రైనెజ్ కాలవలలో కుప్పలు కుప్పలుగా ఉన్న చెత్త చెదారం. తాగునీటి వసతి. కొన్ని వీధులలో వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు తెలియజేయడంతో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేధి క కార్యక్రమంలో రాపూరు పట్టణం లో పారిశుధ్యం, డ్రైనెజ్, నీటి సరఫరా, వీధి లైట్లు, పనులను, వెంటనే పరిష్కరించాలని, రాపూరు కొత్త అరుంధతీయ వాడలో సీసీ రోడ్లు. డ్రైనే మంజూరు చేయవలసిందిగా. వినతి పత్రం కూడా అందజేయడం జరిగిందని, రాపూరు మండల జన సేన అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి తెలియజేశారు.

శ్రామిక మహిళలు చైతన్యవంతులవ్వాలి

విశాలాంధ్ర-కావలి: లోక్ అదాలకు సభ్యులు ఎం. మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకొని సాంఘికంగా సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని కోరినారు కావలి మండలం ఆముదాల దీన్ని గిరిజన కాలనీలో శ్రామిక మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు మాలకొండ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజన మహిళలు పట్టణంలోని ఉద్యోగులు ధనవంతుల ఇళ్లల్లో పాసి పని చేసుకుని పేదరికంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా మహిళా దినోత్సవం సందర్భంగా కష్టజీవులైన శ్రామిక మహిళలు సమాజం పట్ల అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలని కోరినారు బాల్య వివాహాలను నియంత్రించి బాలబాలికలను పాఠశాలలకు పంపి బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పై అవగాహన పెంచుకొని లోక్ అదాలతో ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు పొంది సాంఘికంగా ఎదగాలని కోరినారు ఈ కార్యక్రమంలో వేటగిరి పావని వై ప్రభావతి మౌనిక పిచ్చమ్మ మహిళలు పాల్గొన్నారు.

జనసేన జనవాణి

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: నెల్లూరులోని గోమతి నగర్ లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి జనసేన నాయకులు వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనసేన సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, మార్కెట్ సురేష్, బత్తుల శ్రీకాంత్, అనిల్, రవికుమార్ రాజేష్, వీర మహిళలు నందిని, ప్రసన్న, వరలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకి స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికారు. బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపీ వేమిరెడ్డిని ఆప్యాయంగా పలకరించారు.

జలదంకి మండలంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ పర్యటన

విశాలాంధ్ర-జలదంకి: జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవో జే. మోహన్ రావు బుధవారం జలదంకి మండలంలో పర్యటించారు. జలదంకి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న సర్వే గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్రాహ్మణ కాక సచివాలయంలో సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏఓ శ్రీధర్, మారెళ్ళ బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిపిసిఎల్ గ్యాస్ పైప్ లైన్‌ను వ్యతిరేకించిన రైతులు

విశాలాంధ్ర-ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టు నుండి హైదరాబాదు వరకు బిపిసిఎల్ వేసే గ్యాస్ పైప్ లైన్ తమ గ్రామాల మీదుగా వేయవద్దని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద బిపిసిఎల్ కంపెనీ గ్యాస్ పైప్ లైన్ వేసే గ్రామాల రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. కృష్ణపట్నం పోర్ట్ నుండి కృష్ణపట్నం, ముత్తుకూరు, మామిడిపూడి, పెడతా పోలూరు గ్రామాల మీదుగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ గ్యాస్ పైప్ లైన్ హైదరాబాదు వరకు వేసేందుకు రంగం సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అయితే రైతులు తమ పంట భూముల లోను, గ్రామాల మీదుగా వెళ్లడాన్ని వ్యతిరేకించడంతోపాటు తమ భూములకు ప్రస్తుతం ఇస్తున్న మార్కెట్ విలువ కంటే మూడు రెట్లు అధికంగా కాకుండా నాలుగు రెట్లుగా ఇవ్వాలని, అలాగే భూమిలో వేసే పైప్ లైన్ పైన అధికారాలు తమకే ఉండాలని, బిపిసిఎల్ కంపెనీ అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిపిసిఎల్ ఏరియా మేనేజర్ ప్రమోద్, ప్రతినిధులు సత్యవతి పాల్గొన్నవారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ తాసిల్దార్ ప్రదీప్ వ్యవహరించారు. అలాగే టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, అక్కయ్య గారు ఏడుకొండలు, బొలిగర్ల శ్రీను, సుంకర శ్రీనివాసులు యాదవ్, అలాగే గోపాలపురం కృష్ణపట్నం నాయకులు బొలిగి ఆనందయ్య, మామిడాల సీనయ్య, రైతులు పాల్గొన్నారు. రైతులు వ్యతిరేకించడంతో సభ పూర్తి కాకుండానే బిపిసిఎల్ ప్రతినిధులు అక్కడ నుండి వెళ్లిపోయారు.

మండలంలో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర-ముత్తుకూరు: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకై మండలంలో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్న రాణి తెలిపారు. బుధవారం మండలంలోని దొరువుల పాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 9,400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయడం జరిగిందన్నారు. కనీస మద్దతు ధర అందించేందుకు పౌరసరఫరాల శాఖ మండలంలో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు ఏ గ్రేడ్ ధాన్యానికి పుట్టికి 19,720 రూపాయలు మద్దతు ధర ఉందన్నారు.

గండిపాలెం ప్రాజెక్ట్, చెరువులు కాలువలపై

అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే కాకర్ల

యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే సురేష్

విశాలాంధ్ర-నెల్లూరు: అమరావతిలో జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ మెట్ట ప్రాంత అభివృద్ధిపై గళం విప్పారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత వరప్రసాదిని అయిన పొన్నుబోయిన చెంచురామయ్య గండిపాలెం రిజర్వాయర్ అభివృద్ధి నియోజకవర్గంలోని 149 చెరువుల కాలువల అభివృద్ధి కోసం యుద్ధ పాతిపదికన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఉప సభాపతి రఘురాం కృష్ణంరాజు ద్వారా ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని శాసనసభ్యులు కాకర్ల సురేష్ కోరారు. ఉదయగిరి ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మెట్టు ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 149 చెరువులు ఉన్నాయని, దేవుని దయతో వర్షాలు కురిసి చెరువులలోనికి నీరు చేరిన చెరువు నీటిని రైతాంగం ఉపయోగించుకునేందుకు చెరువు కాలువలు సరిగా లేవన్నారు. చెరువు కాలువల పూడికతీత పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గండిపాలెం రిజర్వాయర్ కి ప్రత్యేకంగా అకౌంట్ లేదని అకౌంట్ ఏర్పాటు చేయడంతో పాటు, రిజర్వాయర్ కాలువల పూడిక తీత పనులు చేపట్టాలని తెలియజేశారు. సొంత నిధులతో కొన్ని కాలువల పూడికతీత పనులు పూర్తి చేసి 4 వేల ఎకరాలకు సాగునీరు అందించామని, మొత్తం ఆయకట్టు 16 వేల,ఎకరాలని, ఆ భూమిని కూడా సాగులోని తెచ్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

చూచి రాతను సహించం

కావలిలో విస్తృతంగా పర్యటించిన

జిల్లా విద్యాధికారి బాలాజీ

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-కావలి: ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో ఎవరైనా ఏ కేంద్రంలో అయినా చూచి రాస్తున్నట్టుగా స్లిప్పులు పెడుతున్నట్లుగా తమ దృష్టికి వస్తే తప్పక కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి ఆల్ బాలాజీ రావు హెచ్చరించారు. బుధవారం 'విశాలాంధ్ర' దినపత్రికలో ప్రచురితమైన అంతా ఓపెన్ శీర్షికతో ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో జరుగుతున్న బాగోతంపై కథనానికి డిఇఓ స్పందించి కావలికి చేరుకున్నారు ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న ఐదు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఏమైనా నిర్దిష్టంగా సమాచారం అందజేస్తే తప్పక చర్యలు తీసుకోగలమని పేర్కొన్నారు. విచారణ సమగ్రంగా ఉంటుందని తెలియజేశారు. జిల్లాలో 20 కేంద్రాల్లో ప్రస్తుతం ఈ పరీక్షలను ఈ నెల మూడో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాలు నెల్లూరు నగరంలో 7 ఆత్మకూరు 4 కందుకూరులో 4 కావలి లో 5 ఉన్నాయని తెలిపారు. రోజు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ ల ద్వారా విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్లు వెళ్లే రూట్లో ఉన్న సైతం ఒకటిన్నర గంట ముందే తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇకమీదట ఈ పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు

మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-ముత్తుకూరు: రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ వైసిపి అండగా ఉంటుందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కృష్ణపట్నం ఆర్కాట్ పాలెంలోని అక్కయ్య గారి అక్కయ్య తల్లి లక్ష్మమ్మ ఉత్తర క్రియలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు జగన్మోహన్ రెడ్డి అన్ని విధాలా అండగా నిలిస్తే, చంద్రబాబు మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. మత్స్యకార కుటుంబాలకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు మత్స్యకార కుటుంబాలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కాడని తెలిపారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో మత్స్యకార గ్రామాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన మరో ప్రధాన హామీ డీజిల్ పై 50 శాతం సబ్సిడీ అంటూ, ఓట్లు దండుకొని అమలు చేయకుండా మొండిచెయ్యి చూపడంతో నాడు 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో వేటనిషేధ సమయంలో రూ.4 వేలు ఉన్న మత్స్యకార భృతిని రూ.10 వేలకు పెంచి, ప్రతి సంవత్సరం 10వేల రూపాయల చొప్పున మత్స్యకార భరోసా క్రమం తప్పకుండా, 5 సంవత్స రాల పదవీకాలంలో 50వేల రూపాయలు మత్సకారుల చేతిలో పెట్టాడని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఎన్నికల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, స్థానిక నాయకులు రాగాల వెంకటేశ్వర్లు, కట్ట సుబ్బయ్య, పోలయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంకొనుగోలుకు సర్వం సిద్ధం

- జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-బిట్రగుంట: తేమ శాతాన్ని లెక్కించేందుకు మాయిశ్చర్ మీటరు, అవసరమైన గోతం సంచులు, సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసేందుకు సర్వం సిద్ధంగా ఉందని, రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కార్తీక్ బుధవారం రైతులకు పిలుపునిచ్చాడు. బోగోలు మేజరు పంచాయతీ చెంచులక్ష్మీపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొనుగోలు కేంద్రంలో జరిగే ప్రతివిషయాన్ని ఆన్లైన్లో పొందుపరిచి, పూర్తి పాదదర్శకంగా కొనుగోళ్లు జరపడంతోపాటు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైకార్యక్రమంలో ఆయన వెంట స్థానిక తెలుగుదేశం నాయకులు, పౌరసరఫరాలశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

శ్రీ పల్నాటి వీర్ల అంకమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు పట్టణంలో తూర్పు సాలి పాలెం నందు బుధవారం శ్రీ పల్నాటి వీర్ల అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ శంకుస్థాపన వైభవంగా జరిగింది. అనుమల వెంకట శరత్ బాబు ధర్మపత్ని కార్తీక్ శాంతి చేతులు మీదుగా ఆలయ శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఆలయ శిల్పులు శ్రీనివాస్, ఉమా శంకర్ లు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పూర్తి రాతి కట్టడంతో జరుగుతుందని. ప్రాచీన ఆలయాలకు దీటుగా అమ్మవారి ఆలయం నిర్మాణం జరుగుతుందని తెలిపారు. శ్రీనివాస్, ఉమా శంకర్ కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీ శ్రీ అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణ శిల్పులు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల

రాత్రింబవళ్లు వెలుగుతున్న వీధిదీపాలు

పట్టించుకోని అధికారులు



విశాలాంధ్ర-వలేటివారిపాలెం: కరెంట్ ఆదాచేయాలని ప్రభుత్వాలు చెబుతున్న పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని నలదలపూరు గ్రామస్తులు వాపోతున్నారు. సచివాలయం ముందే పగటి పూట లైట్లు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శికి, లైన్‌మెన్‌కి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ లైట్లు సకాలంలో ఆర్పకపోవడంతో పంచాయతీలకు విద్యుత్ బిల్లులు అదనపు భారంగా మారుతున్నాయని, గ్రామంలో లైట్లు రాత్రి పూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చెయ్యకపోవడంతో విద్యుత్ బిల్లుల భారం పంచాయతీలకు పెనుబారంగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. పంచాయతీలో పంచాయతీకి ఖర్చులు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ లైట్లు సకాలంలో పగటిపూట ఆపకపోవడంతో విద్యుత్ బిల్లులు పంచాయతీకి పెనుభారంగా మారుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీ వారు వీధిలైట్లను ఆఫ్ చేసి విద్యుత్ బిల్లుల బారాన్ని తగ్గించాలని పలువురు వాపోతున్నారు.